పాఠశాలలు పున:ప్రారంభం

వేసవి సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులను ఎంఈవోలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. పలు పాఠశాలలను అధికారులు ఈ సందర్భంగా తనిఖీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్


ధర్మారం(బి) ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి యోహాన్, ఎంపీడీవో బూక్య లింగం, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి


మల్లారం పాఠశాలలో .. ఎంపీడీవో రాంనారాయణ


గుండారం పాఠశాలలో .. ఎంఈవో సేవ్లా


ముదక్‌పల్లి ప్రైమరీ పాఠశాలలో ..


కోటగల్లీ ప్రాథమిక పాఠశాలలో..


ప్రభుత్వ పాఠశాలలో తన పిల్లలకు అడ్మిషన్ తీసుకుంటున్న నెహ్రూనగర్ సర్పంచ్ అమానుల్లా


నడిపల్లి గాంధీనగర్ కాలనీ ఉర్దూ మీడియం పాఠశాలలో కొత్త పిల్లలకు పూలతో స్వాగతం

మూతబడిన పాఠశాల తెరుచుకుంది

డిచ్‌పల్లి: సాంపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మేలయతండా ప్రైమరీ పాఠశాల గత విద్యాసంవత్సరం పిల్లలు లేక మూతబడింది. ఉపాధ్యాయుల కృషితో గురువారం 10 మంది పిల్లలు పాఠశాలలో చేరడంతో తిరిగి తెరుచుకుంది. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించవద్దని, ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తే నాణ్యమైన విద్యను అందజేస్తామని తల్లిదండ్రులను ఒప్పించారు. దీంతో వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 10 మంది పిల్లలు చేరారు.


మేలయతండా ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులు

మూగ జీవాల అరణ్య రోదన

- అందుబాటులో లేని వైద్యులు

సిరికొండ: సరైన వైద్యం అందక మూగజీవాలు అల్లాడుతున్నాయి. మండల కేంద్రంతో పాటు చీమన్‌పల్లిలో పశు వైద్య కేంద్రాలున్నాయి. రెండు చోట్ల వైద్యులు లేకపోవడంతో సహాయకులే నెట్టుకొస్తున్నారు. ఆరేళ్ల నుంచి ఇన్‌చార్జ్‌లతోనే సరిపెడుతున్నారు. ఏడేళ్ల క్రితం సతీష్ అనే వైద్యుడు బదిలీ కావడంతో జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ కేంద్రం వైద్యుడు బాబూరావుకు సిరికొండ, చీమన్‌పల్లి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన 8 నెలల క్రితం బోర్గాంకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ధర్పల్లి పశు సంవర్ధక శాఖ అధికారి అభిషేక్ ఇన్‌చార్జిగా ఉన్నారు. రెండు కేంద్రాల్లో రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో సహాయకులే వైద్యం చేస్తున్నారు. సిరికొండ, చీమన్‌పల్లి వైద్యశాలల పరిధిలో ఆవులు 8,039, గేదేలు 9,944, గొర్రెలు 26,737, మేకలు 10,844, కోళ్లు 5,444, పెంపుడు కుక్కలు 136 ఉన్నట్లు పశు సంవర్ధక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. మూగజీవాలకు తగిన సమయంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. చుట్టూ అడవులు ఉండటంతో స్థానికులు పశు సంపదను మేత కోసం అడవికి తరలిస్తుంటారు. అడవుల్లో కొన్ని విషపూరితమైన ఆకులు, అలములను పశువులు అప్పుడప్పుడు మేస్తుంటాయి. వానాకాలంలో పాములు, ఇతర క్రిమి కీటకాల బారిన పడుతుంటాయి. ఆ సమయంలో చికిత్స అందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు. వైద్యులను నియమించి మూగ జీవాల బాధలను తొలగించాలని ఆయా గ్రామాల పాడి రైతులు జిల్లా కలెక్టర్, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు, పిల్లలు, తల్లులు

డిచ్‌పల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత సూచించారు. గురువారం మిట్టాపల్లి అంగన్‌వాడీలో అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో న్యూట్రి గార్డెన్, కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

'ది ఓబీసీ అప్రైజింగ్' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

నిజామాబాద్‌నాగారం: ఐఏఎస్ అధికారి, మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి, హైకోర్టు న్యాయవాది పృథ్వీరాజ్ సింగ్ సంయుక్తంగా రచించిన 'ది ఓబీసీ అప్రైజింగ్' పుస్తకాన్ని గురువారం నగర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. నగర పద్మశాలి అధ్యక్షులు పెంట దత్తాద్రి మాట్లాడుతూ.. జూన్ 14 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఘనంగా ఆవిష్కరిస్తామన్నారు. ఈ పుస్తకం మొత్తం 9 విభాగాలుగా రూపొందించారని, ఇందులో బ్రిటిష్ పాలనలో కుల వృత్తులపై జరిగిన సామాజిక, ఆర్థిక దోపిడీ వంటి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయని వివరించారు. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. పద్మశాలి నగర కార్యదర్శి చౌటు భూమేశ్వర్, మోర సాయిలు, ఏనగందుల మురళి, దుబ్బ రాజాం, బాగుల శ్రీనివాస్, అవధూత రాములు, తదితరులు పాల్గొన్నారు.

లా అండ్ ఆర్డర్‌పై అవగాహన



ఇందల్వాయి: సిర్నాపల్లిలో ఇటీవల గొడవలు జరిగి ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా లా అండ్ ఆర్డర్‌పై పోలీసులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ.. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ముఖ్యంగా యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని సూచించారు. ఎస్సై సందీప్, మాజీ ఉప సర్పంచ్ పురుషోత్తమ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యను సబ్జెక్టుగా పెట్టాలని వినతి

నిజామాబాద్‌నాగారం: వ్యాయామ విద్యను తప్పనిసరిగా మూల్యాంకన సబ్జెక్టుగా పెట్టాలని రాష్ట్ర పేటా శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని సీటీఎస్ హెడ్ కెప్టెన్ పాండు రంగారెడ్డికి గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ నెల 9 నుంచి 11 వరకు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన ప్రమోషన్ ఆఫ్ స్పోర్ట్స్ కల్చర్ ఇన్ స్కూల్స్ అండ్ కాలేజెస్ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ నుంచి 16 మంది, రాష్ట్ర జూనియర్ కాలేజీల నుంచి ఐదుగురు, గురుకులాల నుంచి 10 మంది ఫిజికల్ డైరెక్టర్లకు శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగానే వినతి పత్రం సమర్పించారు. ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ ద్వారా ప్రతిపాదన పంపుతామని తెలియజేశారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు టి.విద్యాసాగర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్, లక్ష్మయ్య, పర్వతాల గౌడ్, మర్కంటి గంగా మోహన్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న సంఘం ప్రతినిధులు

సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీయూసీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌ను కోరారు. గురువారం బల్దియా కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు ఆదివారం, పండగ సెలవులు కూడా ఇవ్వకుండా పనిచేయిస్తున్నారని, తగిన పనిముట్లు, భద్రతా పరికరాలు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ ఐడీ కార్డులు ఇవ్వాలన్నారు. నేతలు రమేష్ బాబు, ఎం.సుధాకర్, వై.ఓమయ్య, నరసింగరావు, ఫిరోజ్ అలీ పాల్గొన్నారు.

వర్షంతో రైతుల్లో హర్షం

నిజామాబాద్ రూరల్: మృగశిర కార్తెలో గురువారం ఉదయం భారీగా వర్షం కురిసింది. దాదాపు గంటసేపు వర్షం కురియడంతో రైతులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు వరప్రదాయనులుగా ఉన్న శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు నిండితే రైతులకు ఎలాంటి ఢోకాలేదని రైతులు చెబుతున్నారు. భూగర్భజలాలు అడుగంటిన ప్రదేశాలలో వర్షాలు సంవృద్ధిగా కురిస్తే బోరు బావుల్లో నీరు పెరిగి సాగుకు మరింత ఊతాన్ని ఇస్తాయి. ఇంకా నాలుగైదు భారీ వర్షా కురిస్తే చెరువులు, కుంటలు, బావులు నిండు కుండల్లా మారి నీటి ఎద్దడి లేకుండా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు.

వారం పదిరోజుల్లో వరి నాట్లు షురూ..

రూరల్ నియోజకవర్గంలో ఇంకా వరి నాట్లు ప్రారంభం కాలేదు. ఎక్కడో రెండు మూడు చోట్ల నాట్లు వేశారే తప్ప నియోజకవర్గంలో వరి నాట్లు ఊపందుకోలేదు. వారం పది రోజులైతే వరినాట్లల్లో రైతులు బీజీగా ఉంటారు. ప్రస్తుతం బిహార్ నుంచి వరి నాట్లు వేయడానికి కూలీలు రూరల్ గ్రామాలకు చేరుకున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ రైతులకు ఆశాజనకంగా ఉందని వ్యవసాయ అధికారులు అంటున్నారు.


తిర్మన్‌పల్లిలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. అంతేకాకుండా కురుస్తున్న వర్షాలకు నారుమడ్లు, దుక్కి మంచిగా తడిసి రైతులకు అనుకూలిస్తుంది. వర్షాలు కురిసి రైతులు పంటలు పండిస్తేనే దేశంలోని అన్ని వ్యవస్థలు సజావుగా నడుస్తాయి.

– సందీప్ రెడ్డి, కాలూర్

యూరియా వాడకం తగ్గించాలి


సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ధర్పల్లి: రైతులు పంటల సాగులో యూరియా వాడకం తగ్గించాలని, అవసరం మేరకు రసాయన, పురుగు మందులను పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు శ్వేత, విజయ్ కుమార్ అన్నారు. రామడుగు రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కృషి విజ్ఞాన కేంద్రం(రుద్రూర్), వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు వ్యవసాయ విధానంపై పలు సూచనలను రైతులకు వివరించారు. ఏవో వెంకటేష్, ఏఈవో మనోజ్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సానిటేషన్ పనుల పరిశీలన


డ్రెయినేజీని పరిశీలిస్తున్న కమిషనర్

నిజామాబాద్ సిటీ: కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న 100 రోజుల ప్రత్యేక పారిశుధ్య పనులను గురువారం కమిషనర్ దిలీప్‌కుమార్ పరిశీలించారు. నగరంలోని 4, 5 డివిజన్లలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయ కుమార్‌తో కలిసి పలు కాలనీల్లో తిరిగారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి



సిరికొండ: హుస్సేన్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్–836లో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు రామకృష్ణ డిమాండ్ చేశారు. హుస్సేన్‌నగర్‌లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఉప తహసీల్దార్ ప్రవీణ్‌కు వారు వినతి పత్రం అందజేశారు. 2001 నుంచి 70 మంది పేదలు 140 ఎకరాలను సాగు చేసుకుంటున్నారని, కొందరు పైరవీకారులు ఆ భూమికి నకిలీ వారసులను సృష్టించి కొట్టేయాలని చూస్తున్నారని వారు ఆరోపించారు.

ఆత్మీయ భరోసాను అమలు చేయాలి



సిరికొండ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిరికొండలో గురువారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ రవీందర్‌రావుకు వారు వినతి పత్రం అందజేశారు. దామోదర్, సాయారెడ్డి, భూమాగౌడ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి



నిజామాబాద్‌నాగారం: ఈ నెల 15న నేషనల్ సర్జన్స్ డే పురస్కరించుకొని వారోత్సవాల సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ, ఐఎంఏ ఆధ్వర్యంలో గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర సర్జన్స్ సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ జీవన్‌రావు, జిల్లా అధ్యక్షులు టి.నరేంద్రలు మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రమాదాలు, రక్త స్రావాలు, గర్భిణులకు ఆపరేషన్ చేసినప్పుడు సరైన గ్రూపు రక్తం దొరక్క చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తు చేశారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకొచ్చి రక్తదాన శిబిరాలు నిర్వహించాలన్నారు. డాక్టర్లు భాస్కర్ రెడ్డి, శ్రీశైలం, శంతన్, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగుదాం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లాలోని బంజారాలు అందరం ఐకమత్యంతోనే ముందుకు సాగుదామని ఆలిండియా బంజారా సేవా సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ కెతావత్ యాదగిరి పిలుపునిచ్చారు. గురువారం నగరశివారులోని బోర్గాం(పి)లో గల ఓ ఫంక్షన్ హాల్‌లో బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు, సీనియర్ నాయకులతో కో–ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. జిల్లాలోని బంజారా సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఏకాభిప్రాయంతోనే ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడితోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించామన్నారు. గ్రామ, మండల కమిటీలు పూర్తయిన తర్వాత జిల్లా అధ్యక్షుడు, కార్యవర్గ ఎన్నికలు ఉంటాయని, జిల్లా కమిటీలో అన్ని నియోజకవర్గాల వారికి ప్రాతినిధ్యం ఉండేలా చూస్తామని తెలిపారు. నాయకులు తారాచంద్ నాయక్, కిషన్ నాయక్, బిలోజీ నాయక్, బాబూరావు, గంగారాం, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి చిత్రం



పొంచి ఉన్న ప్రమాదం

నిజామాబాద్ రూరల్: మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో బైపాస్ దాటిన తర్వాత రోడ్డులో సగం మాత్రమే కల్వర్టు నిర్మించారు. కల్వర్టు నిర్మాణం జరిగిన ప్రాంతంలో ఒక వైపు మట్టి కొద్దిగా కుంగి గుంత ఏర్పడింది. కాలక్రమేణా అది పెద్దగా మారింది. ఈ మార్గంలో వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. రాత్రివేళలో అయితే గుంత ఏర్పడటం లేదు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భారీ వాహనాలు కూడా బోల్తా పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడమో లేక గుంతను పూడ్చడమో చేయాలని కోరుతున్నాం.

– నర్సయ్య, బర్దిపూర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 నిజామాబాద్ రూరల్ - 97053 46541

ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తాం

- బీవోఐ జీఎం మనోజ్ కుమార్ శ్రీవాస్తవ


మాట్లాడుతున్న జీఎం మనోజ్ కుమార్ శ్రీవాస్తవ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని బీవోఐ తెలంగాణ జీఎం మనోజ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. గురువారం బర్దిపూర్ శివారులోని హోటల్‌లో నిర్వహించిన 'బ్యాంకు ఖాతాదారుల సమ్మేళనం' కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీవోఐ ద్వారా అందిస్తున్న సేవలు, వివిధ రకాల రుణాలు, డిపాజిట్ల గురించి వివరించారు. జోనల్ మేనేజర్ ముకేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సేవలు పొందుతున్న ఖాతాదారులు మరికొంత మందికి చెప్పి నూతన ఖాతాదారులను చేర్పించాలని కోరారు. మెప్మా జిల్లా కోఆర్డినేటర్ మాధురి మాట్లాడుతూ.. ఖాతాదారులకు నాణ్యమైన సేవలందించడం ద్వారానే బ్యాంకుల మనుగడ కొనసాగుతుందన్నారు. అనంతరం రుణాలు మంజూరైన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. డిప్యూటీ జోనల్ మేనేజర్ హితేంద్రనాథ్ శ్రీవాస్తవ, నిజామాబాద్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వంశీనాథ్ గౌడ్, చీఫ్ మేనేజర్లు సురేంద్ర చౌహాన్, సోమశేఖర్, బ్రాంచ్ మేనేజర్లు సంతోష్, అనూష్, తదితరులున్నారు.

లోతు దుక్కులతో తెగుళ్ల నివారణ


మునిపల్లిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

జక్రాన్‌పల్లి: మునిపల్లిలో గురువారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం రుద్రూర్ శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులనుద్దేశించి శాస్త్రవేత్త రాకేష్ మాట్లాడుతూ..నేల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు వేసవిలో లోతు దుక్కులు దున్నించాలన్నారు. యూరియా వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. విత్తన శుద్ధి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఏవో దేవిక, ఐడీసీఎంస్ మాజీ చైర్మన్ సాయరెడ్డి, మునిపల్లి మాజీ సర్పంచ్ చిన్న సాయరెడ్డి, ఉప సర్పంచ్ సాయన్న, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి రెడ్డి, వెటర్నరీ డాక్టర్ అశ్విత, రైతులు పాల్గొన్నారు.

విమాన ప్రమాదం బాధాకరం

సుభాష్‌నగర్: గుజరాత్‌లో గురువారం జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం బాధాకరమని ఈ ఘటన దేశాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్‌కులచారి ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఈ హృదయ విదారక ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి తనతోపాటు బీజేపీ జిల్లా శాఖ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,900	వెండి(కిలో)	1,08,000
22 క్యారెట్స్	90,372		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	క్యాప్సికం	50	90
బెండకాయ	30	50	గాజరుగడ్డ	30	60
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	25	50	దోసకాయ	20	40
బీర్నిసుకాయ	100	150	ఆలుగడ్డ	30	50
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	30	60	గోబిపువ్వు	50	80
పాలకూర	80	120	బీట్‌రూట్	30	60
మెంతికూర	100	140	కరివేపాకు	40	60
కొత్తిమీర	40	60	చామగడ్డ	30	50
పుదీనా	70	100	చిక్కుడుకాయ	40	60

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1 అందాల రాక్షసి-10.20
స్క్రీన్-2 అందాల రాక్షసి-11.00, 4.30
హౌస్‌ఫుల్-5(హిందీ)-1.35, 7.30, 10.30
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 హౌ టూ ట్రైన్ యువర్ డ్రాగన్(3డీ)-11.00, 1.45, 4.30
హౌటూ ట్రైన్ యువర్ డ్రాగన్(3డీ ఇంగ్లీష్)-7.15,10.00
స్క్రీన్-2 హౌస్‌ఫుల్-5(హిందీ)-10.10, 4.25
జాన్ విక్-5-1.40
జాన్ విక్-5(ఇంగ్లీష్)-7.55, 10.40
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.10
స్క్రీన్-3 ది హంటర్: చాప్టర్-1-11.10
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.50
జాన్‌విక్-5-4.20
హౌస్‌ఫుల్-5(హిందీ)-7.05, 10.35
పాడేరు 12 మైలు-8.00
స్క్రీన్ -4 జాన్‌విక్-5-11.30
కట్టప్ప జడ్జిమెంట్-2.15 - పాప-4.50
అందాలరాక్షసి-7.35, 10.45
లలితామహల్ భైరవం దేవి శ్రీ శ్రీ శ్రీ రాజావారు
నటరాజ్ హౌస్‌ఫుల్-5(హిందీ) విజయ్ థగ్‌లైఫ్